క్లుప్తంగా

కేజ్‌వీల్స్‌తో రోడ్లపైకి వస్తే చర్యలు: ఎస్‌ఐ నవత

వెల్దుర్తి(తూప్రాన్): కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు రోడ్ల మీదకు వచ్చి రోడ్లను డ్యామేజ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ నవత తెలిపారు. వెల్దుర్తి పంచాయతీ పరిధి శేరీల గ్రామంలో కేజ్‌వీల్స్‌తో రోడ్లపైకి వచ్చిన రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి సంబంధిత వాహన డ్రైవర్‌లను బైండోవర్ చేయడంతో పాటు కేసులు నమోదు చేశామన్నారు. కేజ్‌విల్స్‌తో రోడ్లపైకి వచ్చినా.. రోడ్డు ఒకవైపు నుంచి మరోవైపు దాటే సమయంలోనూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని లేని పక్షంలో సంబంధిత వాహన యజమానులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు తైబజార్ వేలం పాట

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో తైబజార్ నిర్వహణకు కోసం బుధవారం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రమాదేవి తెలిపారు. బుధవారం ఉదయం 11–30 గంటలకు శివ్వంపేట పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించే తైబజార్ వేలంపాటలో పాల్గొనే వారు రూ.25 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

నర్సాపూర్ రూరల్: మంచి నాయకుడిని కోల్పోయామని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని జక్కపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను సునీతారెడ్డి పరామర్శించి ఓదార్చారు. అనంతరం నర్సాపూర్, అవంచ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో భోగ శేఖర్, నయీం తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



మాట్లాడుతున్న ఏఎస్‌ఐ జయపాల్ రెడ్డి

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ జయపాల్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు మారక ద్రవ్యాల భారి పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఒక క్షణం సంతోషం కోసం వంద ఏళ్ల జీవితాన్ని పాడు చేసుకోవద్దన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై ఉపన్యాసం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జ్ఞానమాల, ఉపాధ్యాయులు, పోలీసుల సిబ్బంది సాయిబాబా, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నదీజలాలతో ఎల్లమ్మకు అభిషేకం

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ అర్చకుడు సుమన్‌శర్మ గంగ, యమునా, సరస్వతీ, భగీరథీ, అలకనంద పంచ నదీజాలాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రం దుర్గాగౌడ్, పుండరీకం గౌడ్, వెంకట్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, మనోహర్‌గౌడ్, కిషోర్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

ఆహ్వానం

నర్సాపూర్ రూరల్: మండలంలోని మహ్మదాబాద్ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల పీఆర్టీ బోజ్యా నాయక్ మంగళవారం తెలిపారు. పాఠశాలలో 3, 4, 5వ తరగతుల్లో పది సీట్ల చొప్పున ఖాళీ ఉన్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకొని ప్రవేశం పొందాలని కోరారు. పాఠశాలలో చేరే విద్యార్థులకు పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, వసతి గృహంలో మంచి భోజన సదుపాయం ఉంటుందన్నారు. ముఖ్యంగా డ్రాపౌట్ పిల్లలకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

సాగుపై అవగాహన

రామాయంపేట(మెదక్): వర్షాకాలంలో పంటలసాగుపై స్థానిక రైతువేదికలో రైతులకు అవగాహ కార్యక్రమం నిర్వహించారు. చీడ,పీడల నివారణ, ఎరువుల యాజమాన్యం, ఇతర అంశాలపై ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్త అవగాహన కల్పించారు. వర్షాకాలంలో సాగులో రైతులను ఆర్థికంగా ఆదుకోవడానికిగాను ప్రభుత్వం విధివిధానాలు రూపొందిస్తోందని వ్యవసాయ సహాయ సంచాలకురాలు వసంత సుగుణ పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు రాజ్‌నారాయణ, సతీశ్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం..

చిన్నశంకరంపేట(మెదక్): ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి, విలువైన కాపర్‌వైర్ చోరీ చేసిన సంఘటన మండలంలోని జంగరాయిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. జంగరాయి గ్రామ శివారులో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దుండగులు ఆయిల్‌తో పాటు కాపర్‌వైరు చోరీ చేసినట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

కేజీబీవీలో చదువు చెప్పేదెన్నడో?

- నెల రోజులైనా కళాశాలకు చేరుకోని విద్యార్థులు
- మొక్కుబడిగా వస్తున్న లెక్చరర్లు, సిబ్బంది
- 15 రోజులు కావస్తున్నా.. కొనసాగని తరగతులు
- మరమ్మతు పనులతో సాగని చదువులు



అల్లాదుర్గం కేజీబీవీలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్న ఫర్నిచర్

అల్లాదుర్గం(మెదక్): కళాశాలలు ప్రారంభమై నెల రోజులు కావస్తోంది. పాఠశాలలు ప్రారంభమై 15 రోజులు అవుతోంది. అయినా కేజీబీవీలో మాత్రం పాఠాలు చెప్పడంలేదు. కళాశాల ప్రారంభ దశలో మరమ్మతు పనులు ప్రారంభించడంతో పనులు పూర్తికాకపోవడంతో విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతోంది. పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన ఇంజనీరింగ్ అధికారులు, కేజీబీవీ జిల్లా స్థాయి అధికారులు సహితం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. నూతనంగా నిర్మిస్తున్న కళాశాల భవనం పనులు కూడా నత్తనడకన చేపడుతుంటే పట్టించుకునే నాథుడు లేడు. విద్యార్థులు రావడం లేదనే సాకుతో టీచర్లు, లెక్చరర్లు విధులకు రావడం లేదు. ఇది అల్లాదుర్గం కేజీబీవీ దుస్థితి. కళాశాలను జూన్ 1 నుంచి ప్రభుత్వం ప్రారంభించింది. కేజీబీవీలో సెకండియర్‌లో 47 మంది, మొదటి సంవత్సరంలో 80 మంది విద్యార్థినిలు జాయిన్ అయ్యారు. 127 మంది విద్యార్థినిలు కళాశాలలో ఉండగా, అధ్యాపకులు ఆరుగురు ఉన్నారు. కాలేజీలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా.. చదువు మాత్రం చెప్పడం లేదు. కళాశాల వచ్చిన ఫర్నిచర్ ఎండకు ఎండుతూ, వానకు తడుస్తుంది.



కేజీబీవీ నూతన భవనంలో బీరు బాటిళ్లు

మందు బాబులకు నిలయం

కేజీబీవీ కళాశాల కోసం నూతనంగా నిర్మిస్తున్న భవనం మందు బాబులకు అడ్డగా మారింది. రోజూ గదుల్లోనే మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అల్లాదుర్గం కేజీబీవీ స్కూల్‌లో 6 నుంచి 10 తరగతులకు 225 మంది విద్యార్థులున్నారు. వీరికి విద్య బోధన చేసేందుకు 6 టీచర్లు ఉన్నారు. నాన్‌టీచింగ్ కింద నలుగులు పని చేస్తున్నారు. పాఠశాలల్లో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయని, పనులు పూర్తయ్యాకే పాఠశాలకు రావాలని విద్యార్థినిలకు ఆధ్యాపకులు ఆదేశించారు. ఎప్పుడు తరగతులు ప్రారంభిస్తారని, ఎప్పుడు రావాలని విద్యార్థినిలు, వారి తల్లిదండ్రులు నిత్యం సిబ్బందికి ఫోన్ చేస్తూనే ఉన్నారు. జిల్లాలో ఇతర పాఠశాల, కాలేజీలలో తరగతులు ప్రారంభం కావడంతో తాము నష్టపోతామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి, పనులు వెంటనే పూర్తి చేయించి తరగతులు కొనసాగించాలని కోరుతున్నారు. కేజీబీవీలో పనిచేసే సిబ్బంది, లెక్చరర్లు, టీచర్లు రోజూ సక్రమంగా రావడం లేదనే ఆరోపణలున్నాయి.

పనులు పూర్తయితేనే తరగతులు

పాఠశాల భవనానికి చేపడుతున్న మరమ్మతు పనులు పూర్తయితేనే తరగతులు ప్రారంభిస్తాం. విద్యార్థులు వచ్చిన మూత్రశాలలు పూర్తి కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి ఉంటుందని మేము వారిని రావొద్దని చెప్పాం. ఈ విషయం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- ప్రవంతి ప్రిన్స్‌పాల్

యాంత్రీకరణతో కూలీల కొరతకు చెక్



డ్రమ్ సీడర్ పద్ధతిలో విత్తనం నాటే విధానం పరిశీలిస్తున్న ఏఓ ఝాన్సీ

వెల్దుర్తి(తూప్రాన్): వరిసాగులో రైతులు సంప్రదాయ సాగు విధానాలకు స్వస్తిపలికి ఆధునిక సాగు విధానాలపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారిని ఝాన్సీ అన్నారు. ఈ మేరకు వెల్దుర్తి గ్రామ శివారులో డ్రమ్ సీడర్ పద్ధతిలో వరినాటు వేసిన రైతు తోట నర్సింలు వ్యవసాయ క్షేత్రాన్ని ఆమె సందర్శించి, రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నారుమడి పద్ధతిలో ఎకరాకు 20 నుంచి 25 కేజీలు విత్తనాలు అవసరమైతే డ్రమ్ సీడర్, వెద జల్లే పద్ధతిలో కేవలం 8 నుంచి 10 కేజీల విత్తనాలు అవసరమవుతాయన్నారు. వరినాటు కోసం ఎకరాకు 5 నుంచి 6 వేలు ఖర్చు అవుతుందని అదే డ్రమ్ సీడర్ పద్ధతిలో కేవలం ఒక వ్యక్తితో ఒక్క రోజులో సుమారు మూడు ఎకరాలు విత్తనం వేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వందన ఉన్నారు.

విద్యా సంస్థలబంద్ విజయవంతం చేయాలి

చేగుంట(తూప్రాన్): ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీకి నిరసనగా బుధవారం విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఏబీవీపీ విద్యార్థి సంఘం మండల కార్యదర్శి వంశీ తెలిపారు. చేగుంటలో ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల దోపిడీకి నిరసనగా బుధవారం విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పలు గ్రామాల ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని వాడి, రాజ్‌పేట సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వినోద్ తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



హోమం చేస్తున్న భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): అంగారక సంకట హార చతుర్థిని పురస్కరించుకొని తిరుమలాపూర్ హనుమాన్ ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని గణపతి విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలతో పాటు హోమాన్ని చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రంగారావు, గిరిధరశర్మ ఉన్నారు.

అనుమతులు లేని చర్చి నిర్మాణం కూల్చివేత

వెల్దుర్తి(తూప్రాన్): వ్యవసాయ పొలాన్ని కన్వర్షన్ చేయకుండా, పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వెల్దుర్తిలోని ఓ వెంచర్‌లో నిర్మిస్తున్న చర్చ్‌ను తొలగించినట్లు పంచాయతీ కార్యదర్శి బలరాంరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన పలువురు బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా చర్చ్ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పంచాయతీ సిబ్బందితో అక్రమ నిర్మాణాలను కూల్చి వేశామన్నారు.

కమ్యూనిటీ టాయిలెట్స్‌కు స్థల పరిశీలన



వెల్దుర్తి బస్టాండ్ సమీపంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ విఘ్నేశ్వర్

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలో కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వానికి ప్రపోజల్స్ పంపిస్తున్నట్లు ఎంపీడీఓ విఘ్నేశ్వర్ పేర్కొన్నారు. ఈ మేరకు బస్టాండ్ సమీపంలో మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజలకు సౌకర్యార్థంగా ఉండేలా కాంప్లెక్స్ నిర్మించనున్నట్లు తెలిపారు. కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.2.10 లక్షల ఉపాధి హామీ, రూ.90 వేలు గ్రామ పంచాయతీ నిధులు సమకూర్చుకోవాల్సి ఉంటుందన్నారు. ఎంపీడీఓ వెంట ఈజీఎస్ ఏపీఓ రాజు, ఈఓ బలరాం రెడ్డి ఉన్నారు.

ఎంపీని కలిసిన బీజేపీ నాయకులు



మెదక్ ఎంపీని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్: మెదక్ ఎంపీ రఘునందన్‌రావును పలువురు బీజేపీ నాయకులు మంగళవారం ఢిల్లీలో కలిశారు. బీజేపీ నియోజకవర్గ మాజీ కన్వీనర్ మల్లేశ్‌గౌడ్ ఇతర నాయకులు అర్వింద్‌గౌడ్ తదితరులు మంగళవారం మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

రామాయంపేట(మెదక్): మెదక్ ఎంపీ రఘునందన్‌రావును రామాయంపేట బీజేపీ నాయకులు కలిసి సన్మానించారు. మెదక్ పార్టీ ఇన్‌చార్జి పంజా విజయకుమార్, నాయకులు ఉన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అవసరం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నారులు ఆరోగ్యంగా ఎదగడానికి అవసరమైన పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో 2వ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల గ్రోత్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారుల బరువు, ఎత్తు పెరుగుటపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. అప్పుడే పుట్టిన బిడ్డల నుంచి ఐదేళ్ల చిన్నారులకు అవసరమైన పౌష్టికాహరం అందించినట్లైతేనే చిన్నారుల ఎదుగుదల ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. చిన్నారులకు అందించాల్సిన పౌష్టికాహరంపై అవగాహన ఉండాలన్నారు. అనంతరం నూతనంగా అంగన్‌వాడీ కేంద్రంలో చేరిన చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం నాగలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, మాలతీ, నాగరాణి, జ్యోతి, రాణి పాల్గొన్నారు.

మొదలైన ఆర్టీసీ బడిబస్

సాక్షి ఎఫెక్ట్



చందంపేట నుంచి వస్తున్న ఆర్టీసీ బడిబస్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని పాఠశాల విద్యార్థుల కోసం ఆర్టీసీ బడిబస్ మంగళవారం ప్రారంభమైంది. చిన్నశంకరంపేట మోడల్‌స్కూల్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నడుపుతున్న బడిబస్ ప్రారంభం కాకపోవడంతో బడులు ప్రారంభం.. బస్సుల ఆటంకం అనే కథనం సాక్షిలో ప్రచురితమైంది. దీంతో స్పందించిన మెదక్ ఆర్టీసీ డీపో మేనేజర్ బడిబస్‌ను తిరిగి పునప్రారంభించారు. దీంతో ఖాజాపూర్, శాలిపేట, చెన్నాయిపల్లి, మడూర్ విద్యార్థులతో పాటు చందంపేట, రుద్రారం, ధరిపల్లి, సూరారం విద్యార్థులకు బస్‌సౌకర్యం కలిగింది. దీంతో సాక్షికి విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

రైతుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామంలో నెలకొన్న భూ సమస్యలు పరిష్కరించాలని రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేశారు. మండల పరిధిలోని పోతులబోగూడ గ్రామానికి సంబంధించి నెలకొన్న భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పరిధిలో 1100 పైచిలుకు ఎకరాలు పట్టా భూములు ఉన్నాయని వాటికి సంబంధించిన సర్వేనంబర్ రికార్డుల్లో తప్పులు ఉండడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామ మాజీ సర్పంచ్ హరికృష్ణ, రైతులు జితేందర్, గౌరమ్మ, నర్సింలు, భిక్షపతి, పద్మ, లక్ష్మీ, అప్పాజీ, వేణు కుమార్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాత, ముత్తాతల కాలం నుంచి సాగుచేసుకుంటున్నా.. పలు భూములకు సంబంధించి ధరణిలో నమోదై కొత్త పట్టాదార్ పాస్‌పుస్తకాలు వచ్చినప్పటికీ పొజిషన్ సర్వే నంబర్ కరెక్టుగా లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అవసరాల నిమిత్తం భూములు అమ్ముకోవాల్సి వస్తే సాగు చేసుకుంటున్న పొజిషన్ భూమి రికార్డు పరంగా సర్వే నంబర్ మరోచోట చూయిస్తుందన్నారు. ప్రస్తుతం ట్రిబుల్ ఆర్ రోడ్డు నిర్మాణానికి గ్రామానికి సంబంధించిన భూములు కోల్పోవాల్సి వస్తుందని సర్వే నంబర్ రికార్డులు సక్రమంగా లేకపోవడం వల్ల నకిలీ పట్టాదారులకు లబ్ధిచేకూరనుందని అన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి గ్రామానికి సంబంధించి భూములను రీసర్వే చేసి అసలైన రైతులను గుర్తించి పట్టా మార్పులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలం



చిట్కుల్‌లో పిచ్చి మొక్కల తొలగింపును పరిశీలిస్తున్న అధికారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని చండూర్, చిట్కుల్ గ్రామాల్లో నిర్వహించే పారిశుద్ధ్య పనులు, డంపింగ్ యార్డులు పరిశీలించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిట్కుల్ గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో నుంచి వచ్చే సెప్టిక్‌ట్యాంక్ వాటర్ కారణంగా వచ్చే దుర్గంధంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజావాణిలో వచ్చిన సమస్యను పరిశీలించి, పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా గ్రామాల్లో నిర్మించిన డంపింగ్‌యార్డులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, తడిచెత్తతో కంపోస్ట్ ఎరువులు తయారు చేయాలన్నారు. దోమల నివారణకు చర్యలు చేపట్టామన్నారు. ఇంటి యజమానులు సైతం తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శరత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి నిధులివ్వండి

రిటైర్డు ఉద్యోగుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న రిటైర్డు ఉద్యోగులు

నర్సాపూర్: పట్టణంలో నిర్మాణంలో ఉన్న రిటైర్డు ఉద్యోగుల భవనాన్ని పూర్తి చేసేందుకు నిధులు ఇవ్వాలని రిటైర్డు ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యే సునీతారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ భవనానికి మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి రూ.ఏడు లక్షలు మంజూరు చేశారని, ఆ నిధులు సరిపడనందున భవన అసంపూర్తిగా ఉందన్నారు. మరో రూ.పది లక్షలు మంజూరు చేస్తే తమ భవనం పూర్తి అవుతుందని అనఆనరు. ఎమ్మెల్యే స్పందిస్తూ.. తాను నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మల్లారెడ్డి, జహీరొద్దీన్, లింగారెడ్డి, గంగారాం, సత్యనారాయణ, మాణయ్య తదితరులు ఉన్నారు.

భూమికి బదులు భూమి ఇవ్వాలి



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): ట్రిబుల్ ఆర్ రోడ్డు నిర్మాణానికి భూమి ఇచ్చేందుకు సమ్మతమేనని కోల్పోతున్న కొద్దిపాటి భూమికి బదులు భూమి లేదా బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం డబ్బులు ఇవ్వాలని రైతులు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ట్రిబుల్ ఆర్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించారు. ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్, ట్రిబుల్ ఆర్ భూముల సేకరణ అధికారులు సత్యనారాయణమూర్తి, సోమేశ్వర్ రావు, సుజాతలక్ష్మి, సర్వేయర్ కార్తిక్, ఆర్‌ఐ సునీల్ రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ట్రిబుల్ ఆర్ రోడ్డులో భూములు కొల్పోతున్న సర్వే నంబర్లు, రైతుల వివరాలు వివరించారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం చాలా తక్కువగా ఉందని మార్కెట్ ధర ప్రకారం లేకుండే భూమికి బదులు భూములు ఇవ్వాలని రైతులు కోరారు. పోతులబోగూడ గ్రామానికి సంబంధించి సర్వేనంబర్ రికార్డులు, పొజిషన్‌కు సంబంధించి వ్యత్యాసాలు ఉన్నాయని ఈ విషయం ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

పింఛన్లు వస్తున్నాయా?: ఎమ్మెల్యే



నర్సాపూర్ ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న వృద్ధులు

నర్సాపూర్: ప్రభుత్వం పెంచిన పింఛన్లు వస్తున్నాయా అని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న వృద్ధులను అడిగారు. తమకు ఇంకా పింఛన్లు రాలేదని పలువురు వృద్ధులు మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఎమ్మెల్యే పోస్ట్ ఆఫీసు మీదుగా వెళ్తూ.. పోస్ట్ ఆఫీస్ వద్ద పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న వృద్ధులతో మాట్లాడారు. ప్రభుత్వం పెంచిన పింఛన్లు వస్తున్నాయా అని ఆమె అడగ్గా.. ఇంకా పెంచలేదని, పాత పింఛన్లు వస్తున్నాయని వారు వివరించారు.

ఎక్కువ శిఖం ఉన్న గ్రామానికే చెరువు

- మత్స్యసహకార శాఖ ఏడీ నర్సింహరావు
- వెల్మకన్న, సదాశివపల్లి గ్రామాల మధ్య చెరువు పంచాయితీ
- నచ్చజెప్పిన ఏడీ, తహసీల్దార్, సీఐ, ఎస్‌ఐ



ఇరు గ్రామాల ప్రజలకు నచ్చజెప్తున్న ఏడీ, తహసీల్దార్, సీఐ, ఎస్‌ఐ

కౌడిపల్లి(నర్సాపూర్): రెండు గ్రామాల మధ్య చెరువు పంచాయితీ పెద్దదవుతుండటంతో అధికారులు రెండు గ్రామాల ప్రజలకు నచ్చచెప్పారు. ఎక్కువ శిఖం భూమి ఉన్న గ్రామానికి చెరువు, మత్స్యశాఖ సొసైటీ వర్తిస్తుందని ఏడీ అన్నారు. ఈ సంఘటన కౌడిపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగింది. మంగళవారం కౌడిపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద మత్స్యసహకార శాఖ ఏడీ నర్సింహరావు, తహసీల్దార్ ఆంజనేయులు, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి ఇరు గ్రామాల ప్రజలను పిలిపించడంతో వెల్మకన్న గ్రామానికి చెందిన ఎంపీపీ ఉపాధ్యక్షుడు నవీన్ గుప్తా, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు అశోక్, సొసైటీ అధ్యక్షుడు బాగులు, సదాశివపల్లి మాజీ సర్పంచ్ వీరయ్య, సొసైటీ అధ్యక్షుడు రాయగిరి, ఇరు గ్రామాల ప్రజలు తరలి వచ్చారు. అధికారులు గ్రామస్తులు తెలిపిన వివారాల ప్రకారం.. కౌడిపల్లి మండలంలోని వెల్మకన్న ఉమ్మడి పంచాయతీగా ఉన్నప్పుడు కనికల చెరువు వెల్మకన్న గ్రామస్తులకు ఉండేది. సదాశివపల్లి పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి చెరువు భూమి ఇటువైపు వచ్చింది. దీంతో సదాశివపల్లి గ్రామస్తులు రెండేళ్లక్రితం సొసైటీని ఏర్పాటు చేసి, చేపలు పెంచుతున్నారు. వెల్మకన్న గ్రామస్తులకు చెరువుపై హక్కులేదని చెప్పారు. దీంతో ఇరు గ్రామాల మధ్య చెరువు పంచాయితీ జరుగుతోంది. వెల్మకన్న గ్రామస్తులు మాట్లాడుతూ.. గతంలో 75 శాతం వెల్మకన్నకు, 25శాతం సదాశివపల్లికి వాటా ఉందని చెప్పారు. రికార్డుల ప్రకారం తమకే చెరువుపై హక్కు ఉందని వెల్మకన్నకు హక్కు లేదని, సదాశివపల్లి గ్రామస్తులు చెప్తున్నారు. దీంతో అధికారులు ఇరు గ్రామల ప్రజలకు గొడవలు పడొద్దని సూచించారు. ఏడీ నర్సింహరావు మాట్లాడుతూ.. రికార్డు ప్రకారం ఎక్కువ భూమి సదాశివపల్లి గ్రామానికి ఉందని దీంతో చెరువు సదాశివపల్లికి వర్తిస్తుందన్నారు. సీఐ జాన్‌రెడ్డి మాట్లాడుతూ.. శాంతియుతంగా సమస్య పరిష్కరించుకోవాలని హెచ్చరించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264